మత్స్యకారులకు బాసటగా ..

వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి చంద్రశేఖరరావు, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు



ఎదురుమొండి గ్రామస్తులుతో సింహాద్రి చంద్రశేఖరరావు, సింహాద్రి రమేష్‌బాబు

ఎదురుమొండి(నాగాయలంక): మత్స్యకారులకు బాసటగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే దీవుల్లో గ్రామాల ప్రజలపై కపట ప్రేమ చూపించే నాయకులు కరోనాలాంటి సమయంలో ఏమయ్యారని, అలాంటి నాయకులకు ఓటు రూపంలో బుద్ధి చెబుదామని దీవి గ్రామం ఈలచెట్లదిబ్బ ప్రజలు ముక్త కంఠంతో భరోసా ఇచ్చారు. మే13న జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, బందరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు పార్టీ శ్రేణులతో కలసి ఎదురుమొండిలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ప్రజలతో మమేకమయ్యారు. తొలుత ఎదురుమొండిలో వారికి అపూర్వ స్వాగతం లభించింది. సింహాద్రి జోడి.. గ్రామంలోని ఆంజనేయస్వామిని ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. పెద్దలు మాట్లాడుతూ కరోనాలాంటి విపత్కర కాలంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు నిత్యం గ్రామాల్లో తిరుగుతూ, వైద్యసేవలు అందిస్తూ ప్రజల కోసం పని చేశారన్నారు. బంధువులు సైతం దగ్గరకు చేరని తరుణంలో ఆయనే జనంలో కలియ తిరిగి ప్రతి సమస్యను పరిష్కరించారని మళ్లీ ఆయన్నే గెలిపించుకుంటామని, దేవుడు మంత్రి తనయుడు ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు గెలుపే లక్ష్యంగా చేస్తామని భరోసా ఇచ్చారు.

సచివాలయ వ్యవస్థతో సమస్యలు దూరం

రమేష్‌బాబు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఉంటే పడవలపై రెండు నదులు దాటి నాగాయలంక రావల్సి వచ్చేదని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో ఆ సమస్యలు మటు మాయమయ్యాయని, వెల్‌నెస్ సెంటర్లతో ఆరోగ్య సమస్యలు తీరాయని పేర్కొన్నారు. చంద్రశేఖరరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందించాలన్న జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగాలని మళ్లీ ఆయన్నే గెలిపించుకోవాలని కోరారు. ఎంపీగా తనకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా రమేష్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ మద్ది చిన్నారి, ముమ్మారెడ్డి సాంబశివరావు (చంటి), పూర్వ డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, బండ్రెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిఖార్సైన నాయకుడు జగన్

కార్యకర్తలతో పేర్ని నాని



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న పేర్ని నాని

మచిలీపట్నం టౌన్: ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు వెనకాడని, మడమ తిప్పని నిఖార్సైన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) పిలుపునిచ్చారు. మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీక కలయిక కార్యక్రమం ఆదివారం కమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పేర్ని నాని కార్యకర్తలు, నాయకులకు పలు సూచనలు చేసి ఎన్నికల్లో పని చేయడానికి కార్యోన్ముఖులను చేశారు. పేర్ని నాని మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అబద్ధాలతోనే రాజకీయం చేస్తారన్నారు. ఇచ్చిన హామీలను ఎన్ని అడ్డంకులు ఎదురైనా అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తరపున ఎన్నికల యుద్ధానికి వెళ్తున్నామన్నారు. మచిలీపట్నం ప్రాంత ప్రజలకు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబునాయుడు మళ్లీ 2024 ఎన్నికల సభలో అవే హామీలు ఇస్తూ ప్రజలను మరోసారి మోసగించేందుకు చూస్తున్నాడని ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో బ్యాంక్ రుణాలతో నాలుగు పోర్టులను నిర్మిస్తుంటే పార్టీ మారిన ఎంపీ బాలశౌరి తానే నిధులు మంజూరు చేయించినట్లుగా చెప్పుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మూడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో చేస్తుంటే బాలశౌరి తాను మంజూరు చేయించానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ మచిలీపట్నానికి పలు రైలు సర్వీస్‌లను మంజూరు చేయించగా పలు రైళ్లు ప్రస్తుతం రద్దయితే ఎంపీ బాలశౌరి ఎందుకు పట్టించుకోవడం లేదని పేర్నినాని ప్రశ్నించారు. ఈ నెల 22వ తేదీ సోమవారం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, 23వ తేదీ మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టుల నామినేషన్ ఘట్టాలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని నాని పిలుపునిచ్చారు. సమావేశానికి నియోజకవర్గంలోని నగరపాలక సంస్థ, మండలంలోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

పేర్ని కిట్టు



కరపత్రం అందించి ఓట్లు అభ్యర్థిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 41వ డివిజన్ బలరామునిపేటలో ఆదివారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి గత 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి జరిగిన సంక్షేమ మేలును వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం గా జగన్‌మోహన్ రెడ్డినే ఎన్నుకుంటే సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగుతాయన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో ముద్రించిన కరపత్రాన్ని ఆయన ఇంటింటికీ అందజేశారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, తనకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. కిట్టుకు 41వ డివిజన్ కార్పొరేటర్, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి



వేములపల్లి చర్చిలో వికాస్, పక్కనే పాస్టర్ ప్రసన్న కుమార్, జెడ్పీటీసీ మురళి, కృష్ణారావు

తాడేపల్లి(ఘంటసాల): అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండటానికి వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు, యువనేత సింహాద్రి వికాస్ విశ్వాసులను కోరారు. ఘంటసాల మండలం తాడేపల్లి, కొత్తపల్లి, కొడాలి, ఘంటసాలపాలెం, వేములపల్లి, చిట్టూర్పు జోడుగూడెం గ్రామాల్లోని పార్టీ నేతలతో కలసి ఆయా చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ కుల మత పార్టీలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ బడుగు బలహీనవర్గాల ప్రజలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సీఎం జగనన్న పని చేస్తున్నారన్నారు. అనంతరం ఆయా చర్చిల్లోని పాస్టర్లు కావూరి సతీష్ పాల్, గుడిసేవ ప్రదీప్ కుమార్, మట్టా ప్రియానందం, ప్రణీత్, మార్కు ప్రసన్న కుమార్, నర్సమ్మ, ప్రభుదాసు, బోయేజు, శరాబందిలు విశ్వాసులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, కొత్తపల్లి, కొడాలి పీఏసీఎస్ చైర్‌పర్సన్లు తాతినేని వెంకట కృష్ణారావు, పరుచూరి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు మూల్పూరి వెంకయ్య, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) ఆదివారం నగరంలోని పలు చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. 41వ డివిజన్‌లోని బలరామునిపేట, కుమ్మరిగూడెం ప్రాంతాల్లో ఉన్న చర్చిలకు వెళ్లగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు నెలల్లో సమస్యల పరిష్కారం

అర్తమూరు ప్రజాదీవెనలో పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక



అర్తమూరులో ఆటో ప్రయాణికులకు కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న రాము

బంటుమిల్లి: మీ సమస్యలు నావి.. రెండు నెలలు ఓపిక పట్టండి అన్నీ పరిష్కరిస్తానని చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, తాత మనవడు జగనన్న నన్ను మీ వద్దకు పంపించాడు.. ఉప్పాల రాంప్రసాదు కొడుకును వచ్చాను మీ అందరు ఆశీర్వదించాలని పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. గ్రామంలో ఆదివారం ప్రజాదీవెన జరిగింది. సర్పంచ్ బొర్రా రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. టీడీపీకి కంచుకోట అయిన అర్తమూరు గ్రామంలో నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమానికి యువకులు, అభిమానులు స్వచ్ఛందంగా వారివెంట తరలి వచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇద్దరూ ఇంటింటికీ తిరుగుతు వారికి కరపత్రాలు అందజేసి ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సారి రామును ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలంటూ హారిక ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువస్తే ఓపికగా వింటూ అన్నా, పెద్దాయనా.. రెండు నెలలు ఓపిక పట్టండి అన్ని పరిష్కరిస్తాం అని వారికి నవ్వుతూ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు ఎవరి సిఫార్సులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాల్లో నేరుగా వేసే సౌకర్యం కలిగించారంటూ పలువురికి వివరించారు. అదే టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసినవారికే పింఛన్లు, పథకాలు అందాయని హారిక వారికి గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వానికి ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను గమనించి ఓటు నిర్ణయం చేయాలని వారిని కోరారు. ఉప్పాల రాము గ్రామస్తులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పి. బాబూరావు, ఎంపీటీసీ పేపేటి వీరబాబు, కృత్తివెన్ను ఎంపీపీ కె.గరుడప్రసాద్, సర్పంచి బి. చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ జి.శేషగిరి, నాయకులు కె.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, మట్టా నాగబాబు, కె.సుగుణకుమార్, ఎం.నాగేశ్వరరావు, ఎం.రాజబాబు, ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్ రాధాకృష్ణ, పి. నాని, పి. పుష్ప, హసీనాబేగం, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు చింతయ్య, మహంకాళి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్టా మహోత్సవాలు



బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురం గ్రామంలో పునఃనిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నాలుగు రోజులుగా ప్రతిష్టా ఉత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీ సీతారాములు, శ్రీ లక్ష్మణ, శ్రీ హనుమత్ సమేత శ్రీ గణపతి, శ్రీ లక్ష్మీదేవీ, ధ్వజస్తంభం కార్యక్రమాలు పండితుల వేద మంత్రాల మధ్య వైభవంగా ముగిశాయి. అనంతరం పూర్ణాహుతి చేశారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పలు గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

పెడనలో భారీ బందోబస్తు

పెడన: నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు సోమవారం పడనున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పలు చోట్ల అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోవడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఒకే రోజు.. అదే సమయంలో నామినేషన్లు దాఖలు చేయనున్న నేపథ్యంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి శొంఠి నాగరాజు ర్యాలీలు లేకుండా నామినేషన్ వేసేందుకు సిద్ధమవ్వగా టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ బస్టాండ్ వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా ఈఆర్వో కార్యాలయానికి వెళ్లనున్నారు. ఈఆర్వో కార్యాలయం వద్ద డీఎస్పీ, సీఐ, నలుగురు ఎస్‌ఐలతో పాటు మరికొందరు ఎస్ఐ-2లు, ఏఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు చేయనున్నట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఎన్నికల నియామవళికి లోబడి నడుచుకోవాల్సిందిగా ఆయా పార్టీల వారికి తెలియజేశామని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ, బీసీలకు అధిక ప్రాధాన్యం



మంగళాపురం(చల్లపల్లి): వైఎస్సార్ సీపీ పాలనలో ఎస్సీ, బీసీలకు అత్యధిక ప్రాధాన్యం లభించిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక చిన్న ఎస్సీ కాలనీలో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి పథకాలతో పాటు, రాజకీయ ప్రగతికి పదవులు కూడా ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రమేష్ బాబును గెలిపించాలని కోరారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం భార్యను వేధిస్తూ, ఆమెపై దాడి చేసిన భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో నివసిస్తున్న షేక్ తస్లీమాబేగంకు 10 ఏళ్ల క్రితం కట్నకానుకలు ఇచ్చి షేక్ షాబాజీతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఫ్లెక్సీల ప్రింటింగ్ షాపులో పని చేస్తాడు. భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధించసాగాడు. తస్లీమాబేగంపై దాడి చేసి చంపుతానని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణయ్య నేటి తరానికి స్ఫూర్తి



బ్రాహ్మణయ్య చిత్రపటానికి నివాళులర్పించిన రమేష్‌బాబు, డాక్టర్ చంద్రశేఖరరావు తదితరులు

నాగాయలంక: అంబటి బ్రాహ్మణయ్య నేటి తరానికి స్ఫూర్తి అని వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. బందరు మాజీ ఎంపీ, అవనిగడ్డ, బందరు మాజీ ఎమ్మెల్యే అంబటి బ్రాహ్మణయ్య 11వ వర్ధంతిని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరావు తొలుత బ్రాహ్మణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ దివిసీమ రాజకీయ చరిత్రలో నీతి, నిజాయతీలకు నిఖార్సైన నేతగా బ్రాహ్మణయ్య కీర్తి గడించారని జోహార్లు అర్పించారు. వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ కోడూరు మండలం ఉల్లిపాలెం-భవానీపురం వారధికి బ్రాహ్మణయ్య నామకరణం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి కృతజ్ఞతలు చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ మద్ది చిన్నారి, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, తోట సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: మాజీ ఎంపీ అంబటి బ్రాహ్మణయ్యకు వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ ఘన నివాళులు అర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వికాస్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ అంబటి బ్రాహ్మణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిద్దాం



బండికోళ్లంకలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): జగనన్నకు ఓటేసి సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిద్దామని అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, కుమార్తెలు నిశ్చల, డాక్టర్ సహజ, డాక్టర్ రంగనాథ్ కోరారు. కొక్కిలిగడ్డ, బండికోళ్లంక గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మరిన్ని పథకాలు కొనసాగించడానికి జగనన్నకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. అంతకుముందు బండికోళ్లంకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, గ్రామ పార్టీ కన్వీనర్ రాయన సత్యనారాయణ, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, మీసాల చిట్టిబాబు, కేసాని వెంకటేశ్వరావు, కేసాని గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం



గీతా మందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టా కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు నల్లూరు దాశరథి శ్రీనివాస దీక్షితులు బ్రహ్మత్వంలో పలువురు అర్చకుల వేద మంత్రాల నడుమ ఉదయం 11 గంటలకు విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేలాది మంది భక్తుల శ్రీమన్నారాయణ నామస్మరణ, స్వామివారికి జయ జయ ధ్వానాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఎంపీపీ తుంగల సుమతీదేవి, లండన్ నుంచి వచ్చిన ధనుంజయరావు, బీజేపీ నాయకురాలు భోగాది రమాదేవి హోమ కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డ మండలంతో పాటు మోపిదేవి, కోడూరు, నాగాయలంక మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి ఉత్సవాన్ని కనుల పండువగా తిలకించారు. అనంతరం 15వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త యర్రంశెట్టి హరిబాబు, లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలోని క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు. క్యూలో వచ్చే భక్తులకు మజ్జిగను అందించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

బోడగుంట(మోపిదేవి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని బోడగుంట ఎస్సీకాలనీలో ఆదివారం రాత్రి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. మురళీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని, అధికారులకు సహకరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో నేడు కౌన్సెలింగ్

పామర్రు: గురుకుల విద్యాలయ సంస్థ ద్వారా నడుపుతున్న పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశ పరీక్ష రాసి ఫస్ట్‌ఫేజ్‌లో సీట్ల కోసం సోమవారం పామర్రు పాఠశాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణారావుపాలెం, తిరువూరు, రుద్రవరం, పామర్రు గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హత పత్రాలతో విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సీతారాముల విగ్రహ పునఃప్రతిష్ట



గూడూరు: ఐదుగుళ్లపల్లిలోని రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ పునఃప్రతిష్ట ఆదివారం ఘనంగా నిర్వహించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయాన్ని గ్రామస్తులు, దాతల సాయంతో అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి దేవతామూర్తులను రూ.70 వేలతో గ్రామానికి చెందిన దాత దారపురెడ్డి కోటేశ్వరరావు, భోగిలక్ష్మి దంపతులు సమకూర్చారు. ఆదివారం దేవతామూర్తుల విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కటకం జానకిరామయ్య, పిచ్చుక తాతారావు, ఊట్ల ఈశ్వరరావు, గుడివాడ సిద్ధయ్య, రాజులపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి కిట్టు నామినేషన్



మచిలీపట్నం టౌన్: వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) ఈనెల 23వ తేదీ మంగళవారం నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ముహూర్తం ప్రకారం ఆదివారం ఉదయం 11.12 గంటల సమయంలో కమ్మవారి కల్యాణం మండపం వద్ద నామినేషన్ పత్రాలపై తన తండ్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో సంతకాలు చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బందరు ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాన్ని ఆయన అందజేయనున్నారు.

500 మందికి మజ్జిగ పంపిణీ



నాగాయలంక: ఎండ, తీవ్రమైన ఉక్కపోత నేపథ్యంలో మండల శ్రీఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో ట్రాఫిక్ ఐలెండ్ ప్రధాన కూడలిలో దాతల ఔదార్యంతో ఆదివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. నాగాయలంక సెక్షన్ ఇరిగేషన్ ఏఈఈ పొన్నూరు రవితేజ, మెడికల్ మర్చంట్ మామిడి రాజగోపాల్ ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. పంచాయతీ వార్డు సభ్యుడు చిట్టా వీర అన్నపూర్ణయ్య, వీఆర్వో టీజీ సాయిబాబు, జల్లూరి మురళీధర్, చిట్టా వెంకట శేఖర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

దేవతా విగ్రహాలకు గ్రామోత్సవం



బంటుమిల్లి: అర్తమూరు గ్రామంలో శ్రీ పార్వతి సమేత రామేశ్వరస్వామివారి ఆలయంలో పలు దేవత విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో మహామండపంతో పాటు తదితర పునఃనిర్మాణ పనులు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రోక్షణ తర్వాత పలు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ట చేస్తున్నారు. ఆదివారం శ్రీ గణపతి, శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ అర్ధనారీశ్వరం, శ్రీ మేధా దక్షిణామూర్తి, శ్రీ వేంకటేశ్వర, శ్రీ బ్రహ్మ, శ్రీ కల్యాణసుందరమూర్తి, శ్రీ విష్ణుదుర్గ, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, నంది విగ్రహాలు, సింహ, కాలభైరవ, నాగమణి సమేత నాగరాజు, బలిపీఠాలు, శిఖరాలను ట్రాక్టరుపై ఉంచి మేళ, తాళాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం ప్రతిష్ట పూజలు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

మచిలీపట్నం టౌన్: స్థానిక బచ్చుపేటలోని శ్రీ భూ పరివార సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య తిరుక్కల్యాణ బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముత్తేవి రవికాంత్, భార్గవి దంపతులు పీటలపై కూర్చోగా పురోహితులు జోస్యుల రాంప్రసాద్, ముత్తేవి శ్రీనివాస శశికాంత్, కాండూరి లక్ష్మీనరసింహాచార్యులు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరగనుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు.